క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ



బాలికలతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దొర్నిపాడు: భాగ్యనగరం జెడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు కావ్య, సులోచన, సుకన్య, మేరి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించారు. ఈనెల 17, 18 తేదీల్లో కదిరిలో నిర్వహించిన 46 ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో నంద్యాల జిల్లా తరఫున ద్వితీయ స్థానం సాధించారు. ఈసందర్భంగా మంగళవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్, హెచ్‌ఎం ఆదిలక్ష్మమ్మ బాలికలను అభినందించి మెడల్స్, సర్టిఫికెట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబులేసు, గంగాధర్, సురేష్‌బాబు, నాగరాజు, వహిదా తదితరులు ఉన్నారు.

వానలు కురవాలని కప్పల ఊరేగింపు



కదిరిపురం తండాలో కప్పల ఊరేగింపు నిర్వ హిస్తున్న మహిళలు

చాగలమర్రి: మండలంలోని కదిరిపురం తండాలో మంగళవారం కొంత మంది మహిళలు వర్షం కోసం కప్పలను కర్రకు కట్టి వేపాకు మండలు, పూలతో అలంకరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వారు గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లగా ఆ ఇంటి యజమానులు గంగమ్మ దేవతను తలచుకుంటూ ఆ మహిళలపై బిందెలతో నీరు పోస్తూ వరుణ దేవుడా మా పై కరుణ చూపి సకాలంలో వర్షాలు కురిపించమని వేడుకున్నారు.

ఐటీని తెచ్చింది రాజీవ్‌గాంధీ



రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

నంద్యాల(అర్బన్): ఐటీ రంగాన్ని భారతదేశానికి పరిచయం చేసింది మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చింతలయ్య తెలిపారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతలయ్య మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లారని, ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, రహిమాన్, హరి, శోభన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రీతిబాయికి ఘన నివాళి



ప్రీతిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): సుగాలి ప్రీతిబాయి వర్ధంతిని పురస్కరించుకుని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆమె చిత్రపటానికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బెనర్జీ మాదిగ, జీపీఎస్ సీమ జిల్లాల కో ఆర్డినేటర్ రవీంద్రనాయక్ మాట్లాడుతూ సుగాలి ప్రీతిబాయి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విష్ణుమాదిగ, శివలింగం మాదిగ, చంటి మాదిగ, రాము మాదిగ పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైద్యులు

నంద్యాల(న్యూటౌన్): కలకత్తాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఘటనకు సంబంధించిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం స్వామి వివేకానంద ఆడిటోరియంలో అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు కొవ్వొత్తులతో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆకతాయిల నుంచి ప్రమాదాలను ఎదుర్కొనేందుకు పెప్పర్స్ స్ప్రే ఎలా ఉపయోగించాలో వైద్యులు లక్ష్మి, అరుణకుమారి, శైలజ పవర్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బయ్య, చైర్మన్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పేరు మార్పు తప్పనిసరి

పత్రాలు ఉంటేనే పాత వాహనం కొనండి

- ఒప్పంద పత్రాలతో విక్రయదారికే నష్టం
- 29, 30 ఫారాల్లో సంతకాలు తప్పని సరి

ఇటీవల ఓ యువకుడు ద్విచక్రవాహనాన్ని వేరే వ్యక్తి వద్ద కొనుగోలు చేశాడు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనానికి సంబంధించిన పత్రాలు అతడి పేరుపై ఉండకపోవడం.. సంబంధిత యజమాని అందుబాటులో లేకపోవడంతో ఆ వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతుండటంతో పాత వాహనాలు కొనుగోలు చేస్తే కచ్చితంగా పేరు మార్పు చేసుకోవాలని చట్టాలు చెబుతున్నాయి. లేకపోతే అనవసర చిక్కుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్నారు.



పాత బైక్‌లు

నంద్యాల(న్యూటౌన్): ఒక వ్యక్తి పేరుతో ఉన్న బైక్‌ను ఇతరులు కొనుగోలు చేస్తే తప్పకుండా తమ పేరుతో బైక్‌ను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. సేల్ అగ్రిమెంట్ పత్రం రాకుంటే సరిపోతుంది కదా అనుకుంటే ఆ తర్వాత లేనిపోని చిక్కుల్లో ఇరుక్కోవాల్సి వస్తుంది. వాహనదారుడు అంతకుముందు వాహనంపై వెళ్తూ చేసిన నేరాలు, నిబంధనల ఉల్లంఘనలు కొత్తగా కొనుగోలు చేసిన వారిపై పడే అవకాశం ఉంది. ఒక్కోసారి కొత్తగా కొనుగోలు చేసిన వ్యక్తి చేసిన నేరాలు పాత యజమానిపై పడే ప్రమాదమూ ఉంది. అందుకే విక్రయదారు, కొనుగోలు దారుడు ఇద్దరూ సేఫ్‌గా ఉండాలంటే వాహనాన్ని కచ్చితంగా కొనుగోలు చేసిన వ్యక్తి పేరుపై బదలాయించడం ఉత్తమం.

జోరుగా మారు బేరాలు

నగరాలు, పట్టణాలతో పాటు ఇటీవల మండల స్థాయిలో కూడా వాహనాల అమ్మకాలు, కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మధ్యవర్తుల ఆధ్వర్యంలో ఇష్టం వచ్చినట్లు క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. కొనుగోలు చేసిన వారు వారం, పది రోజుల్లోపు యాజమాన్య హక్కులను మార్చుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఆలస్యం చేస్తే అధికారులు జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

29, 30 ఫారాలే ముఖ్యం

వాహనం కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా లాంటి ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించుకోవాలి. వాటితో పాటు ఫారం 29 రెండు కాపీలు, ఫారంం 30పై విక్రయించిన వారి సంతకాలు తీసుకుంటే యాజమాన్య హక్కుల బదిలీ సులభమవుతుంది. పాత వాహనం అమ్మేశాక యాజమాన్య హక్కులు బదిలీ చేసుకోకపోతే కష్టాలు తప్పవు. కొత్తగా మరో వాహనం కొన్నప్పుడు అదనపు ఇబ్బందులు ఎదురుకావు. ఈ విషయంపై అవగాహన లేకపోవడంతో ఎక్కువ పన్నులు చెల్లిస్తూనే ఉన్నారు. వాహనాన్ని అమ్మిన వెంటనే ఇరువైపులా యాజమాన్య హక్కులను మార్చుకోవాలి,

“కొన్న వెంటనే మారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



పాత వాహనాలు కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా లాంటి ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించుకుని పేరు, చిరునామా మార్చుకోవాలి. ఇది చాలా ముఖ్యం. తప్పనిసరిగా కొనుగోలుదారుడు చూసుకోవాలి. లేకపోతే అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు లేకపోలేదు. వాహనానికి సంబంధించి ఏదైనా ప్రమాదం జరిగినా, ఏదైనా ఘటన జరిగినా వాహనదారుడు కూడా అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పూర్తిస్థాయిలో నిబంధనలు పాటించాలి.

– శివారెడ్డి, డీటీఓ, నంద్యాల

బాధ్యతల స్వీకరణ

నంద్యాల(న్యూటౌన్): ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా షేక్ అస్మాద్దీన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన న్యాయ శాఖ మంత్రి ఫరూక్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నూతన డీఐని ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నాయకులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రసాయన, వృత్తి విద్యా గ్రూపు, మెకానికల్ సబ్జెక్ట్‌లను కాంట్రాక్ట్ పద్ధతిన బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చక్రధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనె 24న ఉదయం 10 గంటలకు డెమో ద్వారా ఎంపిక ఉంటుందని, మరింత సమాచారం కోసం 9849006229 నంబరును సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఉచిత శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నుంచి 8 రోజుల పాటు జనరేట్ యువర్ బిజినెస్, స్టార్ట్ యువర్ బిజినెస్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తగా ఎదగడానికి, వ్యాపారం చేసుకునేందుకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులందరూ శిక్షణకు హాజరు కావాలన్నారు.

దోమల నివారణతోనే ఆరోగ్యం

రుద్రవరం: దోమల నివారణతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని రుద్రవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శివమోహన్ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన రుద్రవరంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వలేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మరో వైద్యాధికారిణి జ్యోతి, సిబ్బంది, ఆశా వర్కర్లు ఉన్నారు.

దోమల నివారణకు ఆల్ఫాసైపర్ మైత్రిన్



డి.వనిపెంట చెంచుగూడెంలో ఆల్ఫాసైపర్ మైత్రిన్‌ను పిచికారీ చేస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని డి.వనిపెంట పంచాయతీకి మజరా గ్రామమైన చెంచుగూడెంలో మంగళవారం మండల ప్రత్యేక అధికారి ఏడి వరప్రసాద్, సబ్ యూనిట్ మలేరియా అధికారి శివచంద్రారెడ్డిల అధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన కల్పించారు. 119 ఇళ్లలో ఆల్ఫాసైపర్ మైత్రిన్ 5%ను పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు, సీహెచ్‌ఓ కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీడీఓ పోస్టు అసైన్డ్ చేయాలి

గోస్పాడు: యాళ్లూరు సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్) డీడీఓ పోస్టును అసైన్డ్ చేయాలని ఏపీవీవీపీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీ వద్ద వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీహెచ్‌సీ డీడీఓ మెడికల్ ఆఫీసర్ నాటు విల్లింగ్‌తో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కింద గోస్పాడు పీహెచ్‌సీకి వెళ్లారన్నారు. దీంతో కర్నూలు డీసీహెచ్‌ఎస్ ఆదేశాలు డీడీఓ పోస్టుకు స్థానిక సీఏఎస్ స్పెషలిస్ట్ డాక్టర్ శివాణికి డీడీఓ పవర్స్ ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఇంత వరకు ట్రెజరీలో ఈ ఆర్డర్స్‌ను అమలు పరచలేదన్నారు. ఈ కారణాలతో కోవెలకుంట్ల సబ్ ట్రెజరీ కార్యాలయంలో వైద్యశాఖ కమిషనర్ ఇచ్చిన ఆర్డర్స్‌ను అమలు చేయడం లేదన్నారు. ప్రతినెలా ఉద్యోగులకు రెగ్యులర్‌గా జీతాల బిల్లులు 25వ తేదీలోపు సబ్ ట్రెజరీ కార్యాలయానికి పంపుతారన్నారు. 25 దాటితే వైద్య ఉద్యోగులకు ఆ నెలకు సంబంధించిన జీతాలు అందవని తెలిపారు. తిరిగి రీఓపెన్ వచ్చే నెల 6వ తేదీకి సప్లిమెంటరీ కింద పడతాయని వైద్య ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు అందుతాయో తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. సీహెచ్‌సీలో 30 మంది దాకా ఉద్యోగులు పని చేస్తున్నారని, వారికి అందాల్సిన నెల జీతాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కోవెలకుంట్ల ఎస్‌టీఓ స్పందించి డీడీఓ పోస్టు అసైన్డ్ చేయాలని కోరారు.



నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కంబగిరి రాముడు

చాగలమర్రి: గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌లో మట్కా, పేకాట, అక్రమ సారా విక్రయం కేసుల్లో నిందితులకు స్థానిక ఎస్‌ఐ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సీఐ మాట్లాడుతూ గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా, జన జీవనానికి ఇబ్బంది కలిగే విధంగా ఏవరైనా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం గోడిగనూరు గ్రామంలో నిర్వహిస్తున్న పికెటింగ్‌ను పరిశీలించారు. ముత్యాలపాడు గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికా సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీతా, అధ్యాపక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కుందూలో గుర్తుతెలియని మృతదేహం

ఉయ్యాలవాడ : మండలంలోని పెద్దఎమ్మనూరు గ్రామ సమీపంలో కుందూ నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని గ్రామస్తులు మంగళవారం గుర్తించారు. ఉధృతంగా నదీ ప్రవాహం ఉండటంతో ఎగువ ప్రాంతం నుంచి శవం కొట్టుకొని వెళ్తుండగా గ్రామానికి చెందిన వ్యక్తి కెమెరాల్లో బంధించారు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా తమకు సమాచారం లేదని చెప్పారు.



ఉయ్యాలవాడ సమీపంలో మిరప నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

మిరపపైనే ఆశలు..

ఉయ్యాలవాడ : గతేడాది ఖరీఫ్ సీజన్‌లో మిరప సాగు చేసిన రైతులకు బాగా కలసి వచ్చింది. ఈ ఏడాది ఇప్పటి వరకు పదునైన వర్షం కురవలేదు. దీంతో చాలా మంది పటలు వేయలేదు. మంగళవారం తెల్లవారుజామున ఒక మోస్తరు వర్షం కురిసింది. మండలంలో 34.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీనికితోడు శ్రీశైలం, వెలుగోడు రిజర్వాయర్లలో నీటి నిల్వలు పుష్కలంగా వున్నాయి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కుందూనదికి 20 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. దీంతో నదీ తీరం వెంట ఉన్న ఇంజేడు, ఉయ్యాలవాడ, పెద్దయమ్మనూరు, బోడెమ్మనూరు, రూపనగుడి, మాయలూరు, అల్లూరు, తదితర గ్రామాల్లో రైతులు మిరపనాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. గతేడాడి మండలంలో 1,500 ఎకరాల్లో మిరప సూపర్–10, తేజ, తదితర రకాలు సాగు చేశారు. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్లు దిగుబడులు వచ్చాయి. క్వింటా మార్కెట్‌లో రూ. 25 వేల వరకు ధర పలికింది. పెట్టుబడులు పోను ఎకరాకు రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ఆదాయం చేకూరింది. దీంతో ఈ ఏడాది కూడా రైతులు మిరప పంటపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మిరపకు ధర తగ్గింది. అయితే పంట దిగుబడులు వచ్చే సమయానికి ధర పెరుగుతుందనే ఆశతో రైతులు మిరప పంట సాగు చేస్తున్నారు.

23న గ్రామ సభలు

శిరివెళ్ల: మండలంలో ఈ నెల 23వ తేదీన గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకంపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. 2024–25వ ఆర్థిక సంవత్సరానికి 33 రకాల పనులపై సభలో చర్చించి తీర్మానం తీసుకోవడం జరుగుతుందన్నారు. సర్పంచు అధ్యక్షతన జరగనున్న సభలకు ప్రజా ప్రతినిధులు, వార్డు మెంబర్లు, అధికారులు హాజరు కావాలన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

చాగలమర్రి: మండలంలోని కదిరిపురం తండాకు చెందిన మూడే చిన్న బిక్కే నాయక్ (80) కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 15న చిన్న బిక్కే నాయక్ అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురై తన స్వగృహంలో పురుగు మందు సేవించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థినులకు కౌమార దశపై అవగాహన

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ఐఎంఏ అనుబంధ విభాగం మిషన్ పింక్ హెల్త్ ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు కౌమార దశలో ఆరోగ్య అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు డాక్టర్ వసుధారాణి నెలసరి సమయంలో తీసుకోవాల్సిన పరిశుభ్రత, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బాలికలు కౌమార దశలో అండాశయం, థైరాయిడ్, రక్తహీనత, ఆపత్కర సమయంలో స్వీయ రక్షణ గురించి విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు నర్మద, సుష్మ పాల్గొన్నారు.

పూల ధరలపై శ్రావణమాసం ఎఫెక్ట్

శిరివెళ్ల: శ్రావణ మాసంలో పూల ధరలు పెరిగిపోయాయి. వరుస శుభకార్యాలు, పూజలతో ధరలు రెట్టింపుయయ్యాయి. దీంతో ప్రజలు కొనాలంటేనే భయ పడుతున్నారు. మల్లెపూలు కిలో గతంలో రూ.185 ఉంటే నేడు రూ. 450 పైగానే పలుకుతున్నాయి. జాజిపూలు గతంలో రూ. 125 కాగా నేడు రూ. 450 పైగానే. కనకాంబరాల ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి. నాడు కిలో రూ.550 ఉంటే నేడు రూ.1200కు విక్రయిస్తున్నారు. మండలంలోని యర్రగుంట్ల పూల సాగుకు, అమ్మకాలకు ప్రసిద్ధి. ఇక్కడి నుండి నంద్యాల, ఆళ్లగడ్డ, గిద్దలూరు, కడపకు ఎగుమతి అవుతుంటాయి.

కుమార స్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య స్వామికి అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

తడిసిన బియ్యంపై జేసీ విచారణ

మిడుతూరు: మండల పరిధిలోని కడుమూరు గ్రామంలోని 3వ షాపు రేషన్ షాపులో తడిసిన 33 క్వింటాళ్ల బియ్యాన్ని మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పరిశీలించారు. నివేదిక తయారు చేసి పంపాలని తహసీల్దార్ శ్రీనివాసులకు జేసీ సూచించారు. నందికొట్కూరు ఎంఎల్‌సీ స్టాక్ పాయింట్ (గోడౌన్) నుంచి రేషన్ షాపులకు చేరిన తర్వాత తూకాల్లో భారీగా తేడాలు వస్తున్నట్లు కొందరు విలేకరులు జేసీ దృష్టికి తీసుకెళ్లగా ఎంఎల్‌సీ పాయింట్‌ను తనిఖీ చేసి, నిజమని తేలితే చర్యలు తీసుకుంటామని వివరించారు. ఆయన వెంట జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వెంకట్రాముడు, డిప్యూటీ తహసీల్దార్ షానవాజ్, నంద్యాల సీఎస్ డీటీ ప్రసాదు, వీఆర్వో ఆంజనేయులు, డీలర్ కిశోర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతులు



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, నాయకులు బాలవెంకట్, శివ, గౌస్‌లు మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం ఇచ్చారు. వేల సంఖ్యలో రోగులు వస్తున్నారని, సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. పేషెంట్ సహాయకులకు రేకుల షెడ్డు ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం, పార్కింగ్, పెరిగిన రోగులకు అనుగుణంగా సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందిని పెంచాలని విన్నవించారు. కార్డియాలజీ, న్యూరాలజీ విభాగాలకు వైద్యులను నియమించాలని, మందుల కొరత లేకుండా చూడాలని కోరారు.



కలెక్టర్‌ను కలిసిన ముస్లిం జేఏసీ నాయకులు

ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో..

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు అబులైజ్, ఖలీల్, అతావుల్లాఖాన్, గఫార్, సద్దాం, మహబూబ్‌బాషా, సలాం, జాకీర్, అర్షద్, అబ్జల్, మహమ్మద్ హుసేన్ మంగళవారం కలెక్టర్ రాజకుమారిని ఆమె కార్యాలయంలో కలిసి పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. నంద్యాలలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేయాలని, వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ఇబ్బందులు పడకుండా కుందూనదికి గట్టుపై గోడలు నిర్మించాలని, పీఎంజేవీకే ద్వారా నిర్మించిన మిగతా రెండు భవన సముదాయాలను ప్రారంభించాలని, ఉర్దూ కాలేజీ భవనాలను త్వరగా నిర్మించాలని కలెక్టర్‌కు విన్నవించగా ఆమె సానుకూలంగా స్పందించారని జేఏసీ నాయకులు తెలిపారు.



క్రిష్టిపాడు వద్ద బ్రిడ్జిపై పారుతున్న వర్షపు నీరు

పోటెత్తిన కుందూ

దొర్నిపాడు: భారీ వర్షాల కారణంగా వరద నీరంతా కుందూకు చేరడంతో ఉధృ తంగా ప్రవహిస్తోంది. మండలంలోని క్రిష్టిపాడు గ్రామం వద్ద కుందూ నీరు వంతెన ఎక్కి ప్రవహిస్తున్నాయి. దీంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. రెవెన్యూ అధికారులు వంతెనపై రాక పోకలు కొనసాగించవద్దని హెచ్చరికలు జారీ చేశారు. తప్పని పరిస్థితుల్లో కోవెలకుంట్ల, గుళ్లదుర్తి మీదుగా చుట్టూ తిరిగి వెళ్లి వరి నాట్లను కొనసాగిస్తున్నారు.

రైతులు సంయమనం పాటించాలి

- ఇరుగ్రామాల రైతులతో చర్చించిన అధికారులు
- ఆయకట్టు రైతులకు న్యాయం చేస్తామని హామీ




మద్దిగుండం చెరువును పరిశీలిస్తున్న వివిధ శాఖల అధికారుల బృందం

మిడుతూరు: మద్దిగుండం చెరువు ఆయకట్టు రైతులకు న్యాయం జరిగేల చర్యలు తీసుకుంటామని, అప్పటివరకు ఇరు గ్రామాల రైతులు సంయమనం పాటించాలని ఆత్మకురు ఆర్‌డీఓ దాసు, డీఎస్పీ రామాంజినాయక్, మైనర్ ఇరిగేషన్ ఈఈ రఘురామిరెడ్డి సూచించారు. మద్దిగుండం చెరువు నీటి వినియోగంపై జలకనూరు, సుంకేసుల గ్రామాల రైతుల మధ్య ఏర్పడిన సమస్యపై ఇరు గ్రామాల రైతులతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వేర్వేరుగా చర్చించారు. ఇరు గ్రామాల రైతులకు ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకుంటామని, అప్పటివరకు ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. అనంతరం విలేకరులతో ఆర్‌డీఓ దాసు మాట్లాడుతూ ఇరు గ్రామాల రైతుల వాదనలు విన్నామని, ప్రస్తుతం పంటలు సాగు చేసిన నేపథ్యంలో సుంకేసుల గ్రామ రైతులు తమ పొలాలకు యథావిధిగా నీటిని వినియోగించుకోవచ్చని, సాగులో ఉన్న పంటలను పూర్తయిన తర్వాత మళ్లీ పంటలను సాగు చేసుకోవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న పంటలు పూర్తయిన తర్వాత అక్రమ నీటి వినియోగానికి పాల్పడిన వారిని గుర్తించి వారి కనెక్షన్లు తొలగించి చెరువు ఆయకట్టు దారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మద్దిగుండం చెరువును పరిశీలించారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు, విద్యుత్ శాఖ ఏ ఈ శ్రీనివాసులు, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ ఓబులేసు, మైనర్ ఇరిగేషన్, విద్యుత్, ఏఈలు రామ్మోహన్ రెడ్డి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాల రికవరీ గోల్‌మాల్‌పై విచారణ

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో పొదుపు మహిళల శ్రీనిధి రుణాల చెల్లింపుల్లో జరిగిన గోల్‌మాల్‌పై ఏసీ డేగలయ్య, ఏపీఎం అంబమ్మ, శ్రీనిధి మేనేజర్ శ్రీనివాసులు మంగళవారం విచారణ చేపట్టారు. అరుణోదయ గ్రామైక్య సంఘంలోని లిఖిత పొదుపు గ్రూపు సభ్యురాలు కృష్ణవేణి గత ఏడాది అక్టోబర్ 25న రూ.50 వేల రుణం తీసుకుని నెలకు రూ.3 వేల చొప్పున జులై నెలాఖరు వరకు పది కంతులు కట్టింది. అయితే ఆమె ఖాతాలో కేవలం రూ.19,206 మాత్రమే చెల్లించినట్లు చూపిస్తోంది. అలాగే బ్లెస్సీ పొదుపు గ్రూపు సభ్యురాలు శ్యామల రూ.1.50 లక్షల రుణం తీసుకుంది. ఆమె నెలకు రూ.9 వేల చొప్పున నాలుగు నెలలు చెల్లించింది. ఈమె ఖాతాలోనూ రూ.28 వేలు మాత్రమే జమ అయినట్లు చూపిస్తుండటంతో బాధితులు గతంలో ఫిర్యాదు చేశారు. తాము నెలనెలా విలేజ్ బుక్ కీపర్ జ్యోతికి కంతు చెల్లించి రసీదు కూడా తీసుకున్నామని, తమ ఖాతాలో జమ చేయకుండా ఆమె స్వాహా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. బాధితురాళ్లను, వీబీకేను విచారించిన అధికారులు.. ఐదు రోజులు సమయం ఇస్తే అక్రమాలు పూర్తిస్థాయిలో వెలికి తీస్తామని హామీ ఇచ్చారు. స్వాహా చేసినట్లు నిరూపణ అయితే వీబీకే నుంచి నిధులు రికవరీ చేస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు.



పొదుపు మహిళల ఎదుట వీబీకే జ్యోతిని విచారిస్తున్న ఏసీ, ఏపీఎం, శ్రీనిధి మేనేజర్